నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | నల్లగొండ, మంగళవారం 22 ఏప్రిల్ 2025 | YADADRI BHUVANAGIRI

కట్టంగూర్ : లారీలు, హమాలీల కొరతతో అయిటిపాముల ఐకేపీ కేంద్రంలో నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

ధాన్యం.. దయనీయం

నత్తనడకన కొనుగోళ్ల తీరు

ఎక్కడ చూసినా పెద్దఎత్తున ధాన్యం రాశులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కడా చూసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక కొరవడడంతో ధాన్యం కొనుగోళ్లే ఈ సారి ఆలస్యంగా ప్రారంభం కాగా ఇప్పుడు మరింత నెమ్మదిగా సాగుతున్న అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. గత 20 రోజుల్లో ఒక్కో కొనుగోలు కేంద్రంలో కనీసం 10శాతం ధాన్యం కూడా కొన్న దాఖలాలు లేవు. కొన్ని చోట్ల కేంద్రాలు ప్రారంభి వదిలేశారు. దీంతో రైతులు ధాన్యం తెచ్చి కేంద్రాల్లో నిత్యం ఎదురుచూస్తున్నారు. కొన్నిచోట్ల నెల రోజుల కిందట తెచ్చి ఎదురుచూస్తున్న రైతులు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ప్రభుత్వ ఆదేశాలతో కీలకమైన ధాన్యం కొనుగోలు సమయంలో సన్నబియ్యం పంపిణీ, భూ భారతి కార్యక్రమాల్లో అధికార యంత్రాంగం నిమగ్నమై రైతులను గాలికి వదిలేసారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ధాన్యం పెద్ద ఎత్తున పేరుకుపోవడంతో ఏ క్షణాన అకాల వర్షం వచ్చి కొంప ముంచుతుందేమోనన్న తీవ్ర ఆందోళ నలో రైతుల కొట్టుమిట్టాడుతున్నారు. గత వారం పది రోజులుగా అకాల వర్షాలు ధాన్యం రైతుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న విషయం తెలిసిందే.

– నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్21(నమస్తే తెలంగాణ)

- ఒక్కో కేంద్రంలో కనీసం 10 రోజులకు పైగానే ఎదురుచూపులు
- తాలు, తేమ శాతం కొర్రీలతో తాత్సారం
- హమాలీల సమస్యతోపాటు అరకొరగా లారీలు
- మిల్లుల వద్ద దిగుమతులు కాక లారీల ఆలస్యం
- అకాల వర్షాలతో రైతన్న అతలాకుతలం
- ప్రభుత్వ తీరుపై రైతుల మండిపాటు

యాసంగి ధాన్యం కొనుగోళ్లల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ప్రభుత్వంతోపాటు జిల్లా అధికార యంత్రాంగాలు సైతం దీన్ని గత బీఆర్ఎస్ సర్కార్ మాదిరిగా అంత సీరియస్‌గా తీసుకున్నట్లు లేదని రైతుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అందువల్ల కొనుగోళ్లల్లో తీవ్ర జాప్యం జరిగి ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో గత నెల చివరి వారం నుంచే కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి శ్రీకారం చుట్టినా అవి ఆచరణలోకి వచ్చే సరికి ఈ నెల 10వ తేదీ దాటింది. గత నెల 15 తేదీ నుంచే ముందుగా నాట్లేసిన రైతులు ధాన్యం కేంద్రాలకు తేవడం మొదలుపెట్టారు. చాలా చోట్ల ఈ నెల ఫస్ట్ నాటికే ధాన్యం కేంద్రాలకు వచ్చింది. అధికార యంత్రాంగం మాత్రం అందుకు అనుగుణంగా కొనుగోళ్లు ప్రారంభించడంలో తాత్సారం చేసిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సూర్యాపేట జిల్లాలో సోమవారం నాటికి కొనుగోలు అంచనాల్లో కేవలం 15శాతం కూడా పూర్తి కాకపోవడమే అందుకు నిదర్శనం. ఈ జిల్లాలో మొత్తం 286 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో సన్నాల కోసం 74, దొడ్డురకాల కోసం 212 కేంద్రాలను కేటాయించారు. వీటి ద్వారా ఇప్పటివరకు 9వేల మెట్రిక్ టన్నుల సన్నాలు, 34వేల మెట్రిక్‌టన్నుల దొడ్డు రకం ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. వాస్తవంగా ఇక్కడ మొత్తం 3.50లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్ల అంచనా కాగా ఇందులో లక్ష మెట్రిక్ టన్నుల సన్నాలు, 2.50లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం ఉంది. కానీ నేటికి 43వేల మెట్రిక్ టన్నులే కొనుగోలు చేశారు. ఇక యాదాద్రి జిల్లాలో మరీ దారుణంగా కొనుగోళ్లు ఉన్నాయి. ఇప్పటివరకు కేవలం 18,400 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. వాస్తవంగా ఇక్కడ 327 కేంద్రాల ద్వారా 4.50లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ కేవలం 5శాతం కొనుగోళ్లే జరుపడంలో ప్రభుత్వం ఎంత సీరియస్‌గా ఉన్నదనేది స్పష్టం అవుతుంది. ఈ జిల్లాలో గత పది రోజులుగా నిత్యం ఏదో ఒక చోట అకాల వర్షాలతో కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దవుతున్నది. కొన్నిచోట్ల వరదనీటిలో సైతం కొట్టుకుపోయిన దయనీయ పరిస్థితులు ఉన్నాయి. ఇలా ఒకసారి ధాన్యం తడిస్తే మళ్లీ దాని ఆరబెట్టి నిర్దేశిత తేమ శాతం రావాలంటే కనీసం మరో వారం రోజులు సమయం తీసుకుంటుంది. దీనివల్ల కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టుకునే పట్టాలతో పాటు కూలీలకు అదనంగా భారీగా ఖర్చు వస్తుందని రైతులు వాపోతున్నారు. ఇక నల్లగొండ జిల్లాలో మొత్తం ఈ సీజన్‌లో 5.75లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరుపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తం 375 కేంద్రాల ద్వారా నేటి వరకు 1.52లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశారు. ఇందులో సన్నాలు 2300 మెట్రిక్ టన్నులే ఉండగా మిగతాది అంతా దొడ్డురకం ధాన్యం ఉంది. ఈ జిల్లాలోనూ మారుమూల కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. ముఖ్యంగా హమాలీల సమస్య, లారీల కొరత, ధాన్యం దిగుమతి సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ సమస్యలతో రోజుల కొద్దీ జాప్యం జరుగుతుండడంతో రైతులు గతంలో ఎన్నడూ లేని విధంగా దొడ్డురకం ధాన్యాన్ని సైతం నేరుగా అడ్డికిపావుశేరు లెక్క మిల్లర్లకు అమ్ముకుంటున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో రైతులు మద్దతు ధర కొల్పోయి తీవ్రంగా నష్టపోతున్నారు.

త్రిపురారం : బడాయిగడ్డ గ్రామంలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

కొనుగోళ్లకు ఇవే ఆటంకాలు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో లారీల పాత్రనే చాలా కీలకం. అయితే చాలా చోట్ల లారీల కొరత వేధిస్తుంది. ఒక్కో కేంద్రానికి కేటాయించిన రెండు, మూడు లారీలు లోడ్లతో వెళ్లి మిల్లుల వద్దనే రెండు, మూడు రోజులు నిలిచిపోతున్నాయి. దీంతో వెంటవెంటనే ధాన్యం కొనుగోళ్లు జరుపడంలో తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. మిల్లుల వద్దకు వెళ్లాక కూడా తాలు, తేమ పేరుతో మిల్లర్లు దిగుమతికి కొర్రీలు పెడుతుండడంతో సమస్య జఠిలంగా మారింది. ఇక కొన్నిచోట్ల ధాన్యం ఎగుమతులు, దిగుమతులకు హమాలీల కొరత కూడా ఉంది. దీంతో నెమ్మదిగా సాగుతున్నాయి. ఇక కొన్నిచోట్ల లారీల అవసరాలకు అనుగుణంగా కేంద్రాలకు పంపకపోవడంతోనే తీవ్ర ఆలస్యం జరుగుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

- నల్లగొండ మండలంలోని ధాన్యం కొనుగోళ్లకు మిల్లుల వద్ద ధాన్యం దిగుమతుల్లో జాప్యం ఆటంకంగా మారింది. దీంతో ఒక్క అర్జాలబావి కేంద్రంలోనే ఇంకా పెద్ద ఎత్తున ధాన్యం పేరుకుపోయింది.
- పెద్దవూరలో తాలు పేరుతో బస్తాకు మూడు నుంచి నాలుగు కిలోల తరుగు తీస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ 16వేల క్వింటాళ్ల ధాన్యం కేంద్రంలో పేరుకుపోయింది.
- దామరచర్ల మండలంలోని పీఏసీఎస్ కేంద్రంలో 4వేల క్వింటాళ్ల ధాన్యం, 3 ఐకేపీ కేంద్రాల్లో 5వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉంది.
- కట్టంగూరు మండలంలో హమాలీల, లారీల కొరత వేధిస్తున్నది. అయిటిపాముల, ఈదూలూరు, కురుమర్తి, కట్టంగూరు కేంద్రాల్లో రెండు, మూడు రోజులకు ఒక సారి కాంటాలు అవుతున్నాయి. ఇక్కడ ఇంకా 1.60లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని అంచనా.
- నిడమనూర్ మండలంలో ధాన్యం మిల్లుల తరలింపులో ఇబ్బందులు ఉన్నాయి. మిల్లులకు వెళ్లిన లారీలు రెండు, మూడు రోజుల పాటు నిలిచిపోతున్నాయి
- కొండమల్లేపల్లిలో తేమ, తాలు పేరుతో కొనుగోళ్లు మందకోడిగా సాగుతున్నాయి. ఇప్పటివరకు 9వేల క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొన్నారు.
- పీఏ పల్లి మండలంలో 5 కేంద్రాలు ఉండగా ఇప్పటివరకు 10వేల క్వింటాళ్లు మాత్రమే కొనగా మరో 70వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉంది. ఇక్కడ లారీల కొరత తీవ్రంగా ఉంది.
- నకిరేకల్ మండలం చందంపల్లిలో నేటికీ కొనుగోళ్లు ప్రారంభించలేదు. మిగతా చోట్ల గన్నీ బ్యాగుల కొరతతో పాటు లారీలు సకాలంలో రావట్లేదన్న ఆరోపణలు ఉన్నాయి.
- మునుగోడు, శాలిగౌరారం, కనగల్, కేతేపల్లి. కేంద్రాల్లో లారీల కొరతతో ధాన్యం తరలింపు ఆలస్యం అవుతున్నది. చండూరు, కనగల్ నుంచి కూడా ధాన్యం మునుగోడు మిల్లులకు కేటాయించడంతో దిగుమతుల్లోనూ జాప్యం జరుగుతున్నట్లు సమాచారం.
- దేవరకొండ మండలంలో మూడు కేంద్రాలు ఉండగా కొండ భీమనపల్లిలో 77 కుప్పలు ఉండగా కాంటాలు కావడం లేదు. తెలుగుబెల్లిలో కొనుగోళ్లే మొదలు కాలేదు. ముదిగొండలో 57 కుప్పలకు 12 కుప్పలు కొన్నారు.

నల్లగొండ ఆర్జాలబావి కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం రాశులు

నెల దాటుతున్నా కొనే దిక్కేలేదు

మాకున్న నాలుగెకరాల్లో 1010 దొడ్డురకం వడ్లు పండించినం. ధాన్యం ఇక్కడ పోసి నెల రోజులు దాటుతున్నది. ఇప్పటివరకు వడ్లను చూసేవారు లేరు కొనేవారు లేరు. సహకార సంఘం ఛైర్మన్, సీఈఓను అడిగితే రేపు, ఎల్లుండని ఇన్ని రోజులు గడిపింద్రు. ఇకనైనా అధికారులు, నాయకులు స్పందించి మా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

-ధనావత్ సైదా, రైతు, బడాయిగడ్డ, త్రిపురారం

కాంటాలు వేసినా లోడింగ్ కాలేదు

ఐదెకరాల పొలం కౌలుకు తీసకొని వరి పండించిన. అనంతారం పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 20 రోజులు దాటింది. 10 రోజులు ధాన్యాన్ని బాగా ఆరబెట్టిన. కాంటాలు వేసి మూడు రోజులు అవుతున్నది. ఇప్పటి వరకు లారీలో లోడింగ్ కాలేదు. లారీలో బస్తాలు వేసే వరకు రైతుదే బాధ్యత అంటున్నారు. వాన వస్తే ధాన్యం తడుస్తుందని భయమైతుంది.

-గండికోట నాగయ్య, రైతు, అనంతారం, పెన్‌పహాడ్

గుండాలలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

బీఆర్ఎస్‌తోనే ప్రజలకు శ్రీరామ రక్ష

- కేసీఆర్ పాలన స్వర్ణయుగం.. మళ్లీ ఆయన కోసం ఎదురుచూస్తున్న జనం
- ఎల్కతుర్తి సభకు అధిక సంఖ్యలో తరలిరావాలి
- ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

గుండాల, ఏప్రిల్ 21 : ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగ సభకు ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. గుండాల మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం బీఆర్ఎస్ రజోత్సవ సభ విజయవంతానికి సన్నాహక సమావేశం నిర్వహించారు. దీనికి ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ప్రపంచంలోనే ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని, ఎత్తిన నినాదాన్ని నిజం చేసి చూపిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ అని అన్నారు. గులాబీ జెండాను ప్రతి గుండె దగ్గర చేసిన నాయకుడు కేసీఆర్ అని, బీఆర్ఎస్ పార్టీనే ప్రజలకు శ్రీరామ రక్ష అని తెలిపారు. పదేండ్ల కేసీఆర్ పాలన స్వర్ణయుగంగా సాగిందని, రైతుబంధు, రైతు బీమా, 24 గంటల కరెంటు, సాగునీరు, ప్రాజెక్టుల నిర్మాణం, ఐటీ కంపెనీలు వంటి ఏర్పాటుతో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోయిందని చెప్పారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ నంబర్ వన్‌గా తీర్చిదిద్దారని అన్నారు. అంతటి ఘనకీర్తి కలిగిన రాష్ట్రాన్ని నేటి కాంగ్రెస్ పాలనలో భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎండీ ఖలీల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మందడి రామకృష్ణారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మూగల శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వరం మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పొన్నగాని మహేశ్, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు కొమ్మగళ్ల దయాకర్, యువజన విభాగం అధ్యక్షుడు అట్ల రంజిత్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ బొమ్మిరెడ్డి మల్లారెడ్డి, నాయకులు బబ్బూరి సుధాకర్, కోలుకొండ రాములు, మచ్చ చెన్నారెడ్డి, వంగాల మల్లేశ్, అండెం మమత, జటంగి రాజు, మాదరబోయిన శ్రీనివాస్, గిరికత్తుల శ్రీనివాస్, వీరమల్ల సోమన్న, కొండబోయిన పరశురాములు, అనంతుల శేఖర్, సంగి బాలకృష్ణ, గడ్డమీది మహోదయ్, కాసం నగేశ్, యెగమాటి వేణుగోపాల్‌రెడ్డి, వంగూరి అనిల్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు భరోసా ఇవ్వడానికే ఎల్కతుర్తి సభ

ఎల్కతుర్తి సభ ద్వారా కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు భరోసా ఇవ్వనున్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాలు దెబ్బ తిన్నాయి. పంటలు ఎండిపోయి రైతులు, ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీఆర్ఎస్ హయాంలోనే ప్రతి గడపకు పథకాలు అందాయి. 10 సంవత్సరాల కాలంలో సబ్బండ వర్గాలు సంతోషంగా ఉన్నాయి. సన్నబియ్యం ఇస్తున్నామంటూ కాంగ్రెస్ నాయకులు ఇండ్లల్లో భోజనం చేస్తున్నారు. వారికి దమ్ముంటే రుణమాఫీ, రైతు భరోసా రాని రైతులు, మహాలక్ష్మి పథకం ఇవ్వని ఆడబిడ్డల ఇండ్లల్లో కూడా భోజనానికి వెళ్లాలి.

-బూడిద భిక్షమయ్య గౌడ్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే

కాంగ్రెస్ పాలనలో బాధపడుతున్న జనం

దేశంలోనే ఏ రాష్ట్రంలో చేయని అభివృద్ధిని కేసీఆర్ 10 సంవత్సరాల్లో చేసి చూపించారు. కేసీఆర్‌ను వద్దనుకున్నందుకు ప్రజలు బాధపడుతున్నారు. కేసీఆర్ ఎప్పుడు మాట్లాడుతాడో అంటూ ప్రజలు ఎదురు చూస్తున్నారు. మాయ మాటలతో ప్రభుత్వంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టులేక పోయింది. ప్రజలు మంచి ఏదో, చెడు ఏదో అని అన్ని గమనిస్తున్నారు. రుణమాఫీ అని సగం మందికి కూడా చేయకుండా వదిలేశారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పడిపోయింది. బీఆర్ఎస్ హయాంలో మల్లన్న సాగర్, కొండపోచమ్మ జలాశయాలను నిర్మించడం వల్లే ఆలేరుకు సాగునీళ్లు వస్తున్నాయి. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపే దమ్ము ఎవరికీ లేదు.

-గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్

రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

ప్రజల గుండెల్లో గులాబీ జెండా

- పదేండ్ల కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు మేలు
- రజతోత్సవ సభకు దండులా కదిలిరావాలి
- మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

గట్టుప్పల్, ఏప్రిల్ 21 : పదేండ్ల కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాయని, ప్రజల గుండెల్లో గులాబీ జెండా నిలిచిపోయిందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతానికి గట్టుపల్ మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూసుకుంట్ల మాట్లాడుతూ ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ 25 ఏండ్ల పండుగ చరిత్రలో నిలిచిపోయేలా జరుపుకొందామన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, రాను న్న రోజుల్లో అధికారం మళ్లీ బీఆర్ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాజీ ఎంపీపీ అవ్వారి గీతా శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గొరిగె సత్త య్య, చెరుపల్లి భాస్కర్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బండారు చంద్రయ్య, నాయకులు మద్ది ప్రవీణ్ కుమార్ రెడ్డి, వెంకటేశం పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

సమస్యలు పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల ధర్నా

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 21 : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుల(ఫీల్డ్ అసిస్టెంట్లు) సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. మూడు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వేతనాలను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతన చట్టం ప్రకారం రూ. 25వేల వేతనాన్ని అందించాలన్నారు. విధి నిర్వహణలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు మరణిస్తే రూ,15 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాలను కలెక్టర్ కార్యాలయ పరిపాలనా అధికారి జగన్‌మోహన్‌ప్రసాద్, డీఆర్‌డీఓ నాగిరెడ్డికి అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బబ్బూరి శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కంకల సిద్దిరాజు, బైరగోని రమేశ్, జెర్రిపోతుల ఉపేందర్, నరేందర్, రామచందర్, బింగి నర్సింహ, రవి, వెంకటేశ్, సుధాకర్, కుమార్, శ్రీను, రజిత, సునీత, వాణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

కొర్లపహాడ్ వద్ద మంటల్లో కాలిపోతున్న కారు

కేతేపల్లి, ఏప్రిల్ 21 : ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ సంభవించి కారులో మంటలు రావడంతో కాలిబూడిదైన సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధి కొర్లపహాడ్ గ్రామ బస్‌స్టేజీ సమీపంలో 65 వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని పటాన్‌చెరు నుంచి భార్యాభర్తలు సొంత కారులో విజయవాడకు బయల్దేరారు. కొర్లపహాడ్ వద్దకు రాగానే షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా కారులో మంటలు లేచా యి. గమనించిన భార్యాభర్తలు కారును పక్కకు ఆపి అందులో నుంచి బయటకు దిగారు. ఆ తర్వాత నకిరేకల్ ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా అప్పటికే పూర్తిగా దగ్ధమైంది.

కేసీఆర్ పాలనలోనే సంతోషంగా ప్రజలు

- హామీలు అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్
- బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలి
- భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

భువనగిరి పట్టణ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 21 : అబద్ధాలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో జరుగనున్న రజతోత్సవ సభ విజయవంతానికి సోమవారం భువనగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పైళ్ల మాట్లాడుతూ రాదనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, దండగనుకున్న వ్యవసాయాన్ని పండుగ చేసి, అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో గోస పడుతున్నారని తెలిపారు. రేవంత్ సర్కారు హామీలు అమలు చేయకుండా కాలం గడుపుతూ రాష్ట్రాన్ని అభివృద్ధిలో వెనుకకు నెట్టేసిందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించారని, రానున్న రోజుల్లో మరోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ మాట్లాడుతూ వరంగల్‌లోని ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు భువనగిరి పట్టణం నుంచి ప్రతి వార్డు కమిటీ సభ్యులతోపాటు నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. రజతోత్సవ సభను పండుగలా జరుపుకొనేందుకు ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సమావేశంలో భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్లు ఎన్నబోయిన ఆంజనేయులు, పెంట నరసింహ, నువ్వుల ప్రసన్నాసత్య నారాయణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఏవీ కిరణ్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కాజా అజీముద్దీన్, దిడ్డి కాడి భగత్, నాయకులు కుశంగల రాజు, చెన్న మహేశ్, కడారి వినోద్, తుమ్మల పాండు, చిక్కా ప్రభాకర్ గౌడ్, సుదగాని రాజు, సిద్దుల పద్మ, రత్నపురం పద్మ, బర్రె రమేశ్, ఎన్నబోయిన జహంగీర్, తాడూరు భిక్షపతి, తాడం రాజశేఖర్, ఇక్బాల్ దరి, ఇస్మాయిల్, ముజీబ్, నాగు, పెంట నితీశ్, నాగారం సూరజ్, సైదులు, ఇండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి..

- సమష్టిగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి
- మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నీలగిరి, ఏప్రిల్21 : కనగల్ మండలం దొరెపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి చిన్నపాక వినోద్ ఆ పార్టీకి రాజీనామా చేసి సోమవారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కలిసి మెలిసి పనిచేసి పార్టీ బలోపేతానికి తోడ్పడాలన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించేలా కృషి చేయాలని తెలిపారు. కాంగ్రెస్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరడానికి ముందుకు వస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఐతగోని యాదయ్య, అయితగోని శ్రీను, చిన్నపాక మహేశ్, చిన్నపాక ఆశోక్, చెనగోని నాగరాజు తదితరులు ఉన్నారు.